ఇప్పుడైనా సంతకం పెట్టండి

గవర్నర్ తిప్పి పంపిన 10 బిల్లులకు తమిళనాడు అసెంబ్లీ ఆమోదం

రవి

స్టాలిన్

చెన్నై, నవంబర్ 18: తమిళనాడులో సీఎం స్టాలిన్, గవర్నర్ రవి మధ్య యుద్ధం కొనసాగుతూనే ఉన్నది. రాష్ట్ర అసెంబ్లీ ఆమోదించిన 10 బిల్లులను గవర్నర్‌కు పంపగా ఆయన తిరిగి ప్రభుత్వానికి పంపారు. దీంతో తీవ్ర ఆగ్రహానికి గురైన సీఎం స్టాలిన్ అసెంబ్లీ ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేసి ఆ 10 బిల్లులను తిరిగి ప్రవేశపెట్టారు. ఈ సందర్భంగా స్టాలిన్ మాట్లాడుతూ ప్రజలకు మరింత మెరుగైన పాలన అందించడానికి ప్రభుత్వం పలు బిల్లులను తీసుకొచ్చి, ఆమోదించి గవర్నర్‌కు పంపితే ఆయన తిరిగి పంపారని చెప్పారు. ప్రభుత్వం చొరవను, లక్ష్యాలను కావాలనే అడ్డుకుంటున్నట్టు తెలుస్తున్నదని తెలిపారు. ఈ 10 బిల్లులలో కొన్ని రెండేండ్ల నుంచి ఆమోదానికి నోచుకోకుండా ఉన్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. బిల్లుల్లో ఏమైనా మార్పులు చేర్పులు చేయాల్సి ఉంటే సూచించి తిరిగి పంపితే బాగుండేదని, కానీ ఎలాంటి కారణాలు చెప్పకుండానే బిల్లులు తిరిగి పంపితే ఉద్దేశపూర్వకంగానే ఇలా చేస్తున్నట్టు అర్థమవుతున్నదని స్టాలిన్ పేర్కొన్నారు. రాజ్యాంగం ప్రకారం నడుచుకోవాల్సిన గవర్నరే ఇలా వ్యవహరించడం సరికాదని తెలిపారు. అయినప్పటికీ తమకు రాజ్యాంగం, ప్రజాస్వామ్యంపై గౌరవం ఉన్నదని, అందుకే గవర్నర్ పంపిన 10 బిల్లులను తిరిగి అసెంబ్లీలో ప్రవేశపెడుతున్నామని వెల్లడించారు. అనంతరం సభ నుంచి బీజేపీ, అన్నాడీఎంకే వాకౌట్ చేయగా.. సభ ఈ 10 బిల్లులను ఆమోదించింది.

వైఖరి మారకుంటే ప్రజలే బుద్ధి చెప్తారు

గవర్నర్ల ద్వారా రాష్ట్రాలపై కేంద్రం పెత్తనం చెలాయించాలని చూస్తున్నదని సీఎం స్టాలిన్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ముఖ్యంగా ప్రతిపక్ష పాలిత రాష్ట్రాలే లక్ష్యంగా ఈ తతంగం నడుస్తున్నదని తెలిపారు. ఇప్పటికైనా కేంద్రం తన వైఖరిని మార్చుకోవాలని లేకుంటే సమయం వచ్చినప్పుడు ప్రజలే తగిన బుద్ధి చెప్తారని హెచ్చరించారు.

దవాఖాన స్కామ్‌లో సీఎస్‌ను సాగనంపండి: కేజ్రీవాల్

న్యూఢిల్లీ, నవంబర్ 18: ఢిల్లీ ప్రభుత్వ దవాఖాన టెండర్ స్కామ్‌లో ఢిల్లీ చీఫ్ సెక్రటరీ నరేష్ కుమార్‌ను వెంటనే తొలగించడమో, సస్పెన్షనో చేయాలని ముఖ్యమంత్రి కేజ్రీవాల్ లెఫ్టినెంట్ గవర్నర్‌ను కోరారు. ఈ మేరకు ఆయన ఎల్జీకి దానికి సంబంధించిన నివేదికను పంపారు. ఒక ఏఐ ఆధారిత సాఫ్ట్‌వేర్ కోసం ప్రభుత్వానికి చెందిన ఐఎల్‌బీఎస్ దవాఖాన నుంచి సీఎస్ నరేష్ కుమార్ కుమారుడు కరణ్ చౌహాన్‌కు చెందిన మెటామిక్స్ కంపెనీ ఎలాంటి టెండర్ లేకండానే భారీ కాంట్రాక్టు పొందిందని కేజ్రీవాల్ ఆరోపించారు. ఆ దవాఖానకు చైర్మన్‌గా ఉన్న నరేష్ కుమార్ ఎలాంటి టెండర్ పిలవకుండా తన కుమారుడికి ఆ పనిని కట్టబెట్టడంతో వంద కోట్ల అక్రమాలు జరిగాయన్నారు. కాగా, ఈ ఆరోపణలను ఐఎల్‌బీఎస్ దవాఖాన ఉన్నతాధికారులు కొట్టి పారేశారు. తాము ఒప్పందం కుదుర్చుకున్న కంపెనీకి, నరేష్ కుమార్‌కు ఎలాంటి సంబంధం లేదన్నారు.

మధ్యప్రదేశ్ ఎన్నికల్లో రూ.340 కోట్లు స్వాధీనం

భోపాల్, నవంబర్ 18: మధ్య ప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికలు శుక్రవారం ప్రశాంతంగా ముగిశాయి. ఎన్నికల సందర్భంగా కోడ్ అమలులోకి వచ్చిన అక్టోబర్ 9 నుంచి ఎన్నికలు ముగిసే వరకు రూ. 340 కోట్ల విలువైన నగదు, మద్యం, మత్తు పదార్థాలు, నగలను స్వాధీనం చేసుకున్నట్టు ఆ రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి అనుపమ్ రాజన్ శుక్రవారం వెల్లడించారు. వీటిలో రూ.40.18 కోట్ల నగదు, రూ.17 కోట్ల విలువైన నార్కోటిక్ డ్రగ్స్, రూ.280 కోట్ల విలువైన మద్యం, నగలు, ఇతర వస్తువులు స్వాధీనం చేసుకున్నట్టు ఆయన వివరించారు. 2018 ఎన్నికల్లో స్వాధీనం చేసుకున్న నగదు, వస్తువుల విలువ రూ.72.93 కోట్ల కన్నా ఇది సుమారు ఐదు రెట్లు అధికమని చెప్పారు.

పెట్రో ధరలు తగ్గిస్తాం!

- బీజేపీకి ఓటేస్తే ధరలు తగ్గుతాయని ప్రధాని హామీ
- రాజస్థాన్ ఎన్నికల ప్రచారంలో ఓటర్లకు మోదీ వల
- ప్రజల కష్టాలు ఇప్పుడు గుర్తొచ్చాయా అని నెటిజన్ల విమర్శలు
- ఇలాంటి ఎన్నికల హామీలను ఓటర్లు నమ్మరని చురకలు

చమురు ధరలు తగ్గించడం మా చేతుల్లో లేదని.. అంతర్జాతీయ పరిస్థితుల వల్లే ధరలు పెరుగుతున్నాయని మొన్నటి వరకు బుకాయించిన మోదీ ప్రభుత్వం.. ఎన్నికలు వచ్చే సరికి.. తమ పార్టీకి ఓటేస్తే వాటి ధరలు తగ్గిస్తామని ఆశ చూపుతోంది. అయితే ఇలాంటి బూటకపు హామీలను ప్రజలు నమ్మరని నెటిజన్లు సోషల్ మీడియాలో విమర్శలు గుప్పిస్తున్నారు.



(స్పెషల్ టాస్క్ బ్యూరో)

హైదరాబాద్, నవంబర్ 18 (నమస్తే తెలంగాణ): పెట్రోల్, డీజిల్ ధరల్ని విపరీతంగా పెంచేసి, సామాన్యుడి జేబును గుల్లచేసిన మోదీ సర్కార్, ప్రజల్ని ఇంకా మభ్యపెట్టేందుకు ప్రయత్నిస్తున్నది. 'మాకు ఓటేస్తే..పెట్రోల్, డీజిల్ ధరలు తగ్గిస్తాం' అంటూ ఓట్లను కొల్లగొట్టేందుకు సిద్ధమైంది. శనివారం రాజస్థాన్‌లోని భరత్‌పూర్‌లో జరిగిన ఎన్నికల బహిరంగ సభలో ప్రధాని మోదీ మాట్లాడుతూ, 'బీజేపీకి ఓటేస్తే పెట్రోల్-డీజిల్ ధరలను సమీక్షిస్తాం' అని ప్రకటించారు. బీజేపీని గెలిపిస్తే ఇంధన ధరలను తగ్గిస్తామని ప్రధాని మోదీ హామీ ఇవ్వటం రాజకీయంగా తీవ్ర దుమారం రేపింది. సోషల్ మీడియాలో నెటిజన్ల నుంచి తీవ్ర ఆగ్రహం వ్యక్తమైంది. ఓట్ల కోసం ధరలు తగ్గిస్తారా? బీజేపీకి వేయకపోతే ధరలు తగ్గించరా?..అంటూ నెటిజన్లు మండిపడ్డారు. గత రెండేండ్లుగా అంతర్జాతీయ మార్కెట్‌లో ముడి చమురు ధరలు తగ్గినా, భారత్‌లో ఇంధన ధరల్ని మోదీ సర్కార్ ఎందుకు తగ్గించలేదని ప్రశ్నించారు.

పెట్రో పాలిట్రిక్స్...

గతంలో అంతర్జాతీయంగా క్రూడ్ ఆయిల్ ధరలు తగ్గినా మన దేశంలో ధరలు తగ్గించకపోగా పొరుగు దేశాలైన పాకిస్థాన్, బంగ్లాదేశ్, శ్రీలంక, నేపాలు, అమెరికా, ఫ్రాన్స్,జర్మనీ, ఇటలీ, స్పెయిన్, యూకే, కెనడా లాంటిదేశాల్లో ఎక్కువ ధరలున్నాయంటూ పార్లమెంటులో కేంద్ర మంత్రి హర్దీప్ సింగ్ చెప్పుకొచ్చిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో మతాన్ని అడ్డుపెట్టుకొని రాజకీయాలు చేసినట్టుగా, పెట్రోల్-డీజిల్ ధరలపైనా మోదీ సర్కార్ పాలిట్రిక్స్‌కు తెరలేపిందన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. దేశంలో నిత్యావసర సరుకుల ధరలు అమాంతం పెరగటానికి ఇంధన ధరలే కారణమని, ఎన్నికల్లో గెలుపు కోసం దీని గురించి ప్రధాని మోదీ మాట్లాడటం విడ్డూరంగా ఉందని నెటిజన్లు కామెంట్ చేస్తున్నారు.

పెట్రోల్- డీజిల్ ధర పెంపు ప్రభావం నిత్యావసర సరుకులపై కూడా పడుతుంది. రవాణాకు అయ్యే ఖర్చు కూడా ఉల్లి, పప్పులు, నూనె లాంటి నిత్యావసర సరుకుల ధరల పెరుగుదలకు కారణమవుతుండటంతో మోదీ పాలనలో సామాన్యుడికి పట్టపగలే చుక్కలు కనిపిస్తున్నాయి. మధ్య తరగతి వారి కష్టాలు ప్రభుత్వం పట్టించుకోదు. ఎన్నికల్లో అధికారాన్ని నిలుపుకోవడానికో, లేదా అధికారంలోకి రావడానికి ఇలా కేంద్రంలోని బీజేపీ నాయకులు, ముఖ్యంగా ప్రధాని నరేంద్ర మోదీ..ప్రజలను మభ్య పెట్టేందుకు పలు హామీలు ఇచ్చే బదులు, గత తొమ్మిదిన్నరేండ్ల నుంచి సామాన్యులకు మేలు చేసే చర్యలు తీసుకోకుండా ఎన్నికల ముందు హామీలిస్తే ప్రజలు నమ్మరని నెటిజన్లు సోషల్ మీడియాలో కామెంట్లు పెడుతున్నారు. బడాబాబులకు కొమ్ము కాస్తూ..అదానీ లాంటి వారిక్కి ప్రజాధనం దోచిపెడుతున్నారని సోషల్ మీడియాలో నిరసనలు వెల్లు వెత్తుతున్నాయి.

పంచతంత్రం

గత తొమ్మిదిన్నరేండ్లలో ధరల పెరుగుదల

ఇంధనం	2014	2023	పెరుగుదల శాతం
పెట్రోల్	రూ. 71	రూ.109	54 శాతం
డీజిల్	రూ. 55	రూ. 97	77 శాతం
వంటగ్యాస్	రూ. 399	రూ. 980	146 శాతం

సంవత్సరం	బ్యారల్ ముడి చమురు ధర	లీటర్ పెట్రోల్	లీటర్ డీజిల్
2014	110 డాలర్లు	రూ.71	రూ. 55
2023	70 డాలర్లు	రూ.109	రూ.97

మహారాష్ట్రలో 60 కోట్ల స్కామ్

ముంబై, (నమస్తే తెలంగాణ) : బీజేపీ కూటమి పాలిత మహారాష్ట్రలో మరో కుంభకోణం వెలుగులోకి వచ్చింది. ఇటీవల బయటపడిన ఆదర్శ్ పథ్ పేడి రూ.202 కోట్ల కుంభకోణం మర్చిపోకముందే, ఆదర్శ్ మహిళా సహకార బ్యాంకులో రూ.60 కోట్ల మేరకు అమాయకులను మోసగించినట్లు వెల్లడైంది. ఛత్రపతి శంభాజీ నగర్ జిల్లాలోని ఈ బ్యాంకు డైరెక్టర్లు, అధికారులు కుమ్మక్కై నకిలీ పత్రాలు తనఖా పెట్టి శేంద్రే కమంగర్ గ్రామస్థుల పేరు మీద రుణాలు తీసుకున్నారు. ఇందుకు గ్రామస్థుల ఆధార్, పాన్ నంబర్లను అక్రమంగా ఉపయోగించారు. పని చేయని ఫోన్ నెంబర్లను ఇచ్చారు. రుణం తీర్చాలని ఈ గ్రామానికి చెందిన 32 మందికి నోటీసులు రావడంతో ఈ స్కామ్ వెలుగులోకి వచ్చిందని గ్రామస్థులు తెలిపారు. ఆదర్శ్ బ్యాంకుకు 23 ఏండ్ల నుంచి డైరెక్టర్‌గా ఉన్న నామ్‌దేవ్ దాదారావు కచ్ కురేను ఆదర్శ్ పథ్ పేడి స్కాంలో అరెస్టు చేశారు. ఫిక్స్‌డ్ డిపాజిట్ డబ్బులు తిరిగి రాలేదని, పైగా తామే రుణం తీసుకున్నట్లు, ఆ రుణాన్ని తిరిగి చెల్లించాలని నోటీసులు వచ్చాయని బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఉద్యోగాలు అడిగితే రెజ్యూమ్‌లు ఇస్తారట!

ఇదీ మహారాష్ట్రలోని బీజేపీ సర్కారు తీరు

థానె, నవంబర్ 18: మహారాష్ట్రలోని డబుల్ ఇంజిన్ ప్రభుత్వం విచిత్ర ఆలోచన చేసింది. యువతకు ఉద్యోగ, ఉపాధి కల్పించాల్సిన ప్రభుత్వం దీన్ని వదిలేసి తెరపైకి రెజ్యూమ్ ఆలోచనను తీసుకొచ్చింది. యువతకు నాణ్యత గల రెజ్యూమ్‌లను అందజేయాలనుకుంటున్నది. ప్రభుత్వం ఏర్పాటు చేసిన వాట్సాప్ నంబర్‌కు హాయ్ అని మెసేజ్ చేసి అడిగిన ప్రశ్నలకు సమాధానాలు చెప్పినవారికి డిజిటల్ రెజ్యూమ్ వచ్చేస్తుంది. ఈ ఆలోచనపై ప్రభుత్వం పెద్దలు స్పందిస్తూ సరైన రెజ్యూమ్ లేకపోవడంతో యువత ఉద్యోగ, ఉపాధి అవకాశాలు అందుకోలేకపోతున్నారని చెప్పారు. అందుకే ఈ విధానాన్ని తీసుకొస్తున్నామని వెల్లడించారు. ఇందులో కృత్రిమ మేధను ఉపయోగిస్తామన్నారు.

థానేలో వేలాది విద్యార్థుల ఆకలి కేకలు

ముంబై, నవంబర్ 18 (నమస్తే తెలంగాణ) : మహారాష్ట్రలోని థానే జిల్లాలో దాదాపు 40 వేల మంది విద్యార్థులు మూడు రోజుల నుంచి ఆకలితో అలమటిస్తున్నారు. ప్రభుత్వ సాంఘిక సంక్షేమ హాస్టళ్లు, ప్రభుత్వ సహాయంతో నడుస్తున్న పాఠశాలలకు భోజనాన్ని సరఫరా చేసే బ్రిక్స్ కంపెనీ కాంట్రాక్టు ఈ నెల 15తో ముగిసింది. కొత్త కాంట్రాక్టర్ ఇంకా బాధ్యతలు స్వీకరించలేదు. దీంతో విద్యార్థుల్లో కొందరు సొంత ఖర్చులతో భోజనం చేస్తున్నారు. మిగిలినవారు దాతల ఔదార్యంపై ఆధారపడుతున్నారు. ఈ పరిస్థితిని తెలుసుకున్న మానవ హక్కుల సంరక్షణ సమితి, భీమ్ పాంథర్ పార్టీ నేతలు సాంఘిక సంక్షేమ శాఖ అసిస్టెంట్ కమిషనర్ సుకేశిని తెల్‌గోటే దృష్టికి విషయాన్ని తీసుకెళ్లారు. సుకేశిని వెంటనే స్పందించి, దీనికి బాధ్యులపై చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. మెస్‌లను వెంటనే ప్రారంభించాలని ఆదేశించారు.

'అభివృద్ధి కోసం ఉరిశిక్షకైనా సిద్ధమే'

ముంబై, నవంబర్ 18: మహారాష్ట్ర, ముంబై నగర అభివృద్ధి కోసం తాను ఉరిశిక్షకైనా సిద్ధమని శివసేన (ఉద్ధవ్ వర్గం) ఎంపీ ఆదిత్య ఠాక్రే అన్నారు. ప్రభుత్వ అనుమతి లేకుండా ముంబైలో ఓ వంతెనను ప్రారంభించారంటూ ఎంపీ ఆదిత్య ఠాక్రే, పార్టీ కార్యకర్తలపై కేసు నమోదైంది. ఈ ఘటనలో సీఎం ఏక్‌నాథ్ షిండే సర్కార్ వ్యవహరించిన తీరుపై ఠాక్రే మండిపడ్డారు. శనివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ 'మహారాష్ట్ర, ముంబై అభివృద్ధి కోసం పనిచేస్తే ప్రభుత్వం నాపై కేసులు పెట్టింది. ఈ ప్రభుత్వమే అక్రమంగా ఏర్పడ్డది. అలాంటిది అక్రమంగా వంతెనను ప్రారంభించానని నాపై కేసు పెట్టింది' అని విమర్శించారు.

అన్నింటినీ కాషాయీకరణ చేస్తున్నారు: మమత

న్యూఢిల్లీ, నవంబర్ 18: దేశంలోని అన్నింటినీ కాషాయీకరణ చేస్తున్నారని, దాంట్లో భాగంగానే భారత క్రికెట్ జట్టు ప్రాక్టీస్ జెర్సీల రంగును నీలం నుంచి కాషాయ రంగులోకి మార్చారని పశ్చిమ బెంగాల్ సీఎం మమతా బెనర్జీ మోదీ సర్కార్‌పై మండిపడ్డారు. శుక్రవారం కోల్‌కతాలో జరిగిన ఓ కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ, 'నేడు ప్రతీది కాషాయీకరణ జరుగుతున్నది. భారత క్రికెట్‌ను సైతం వదల్లేదు. క్రీడాకారుల ప్రాక్టీస్ జెర్సీల రంగు నీలం నుంచి కాషాయంలోకి మార్చారు. మెట్రో స్టేషన్లకు కాషాయాన్ని పులుముతున్నారు. మోదీ సర్కార్ వచ్చాక దేశంలో ఇది సర్వ సాధారణమైంది' అని అన్నారు.

కాపీ కొట్టాను.. బెదిరించాను

బ్రిజ్ భూషణ్ వెల్లడి

గోండా: మహిళా రైజర్లపై లైంగిక వేధింపుల ఆరోపణలు ఎదుర్కొంటున్న బీజేపీ ఎంపీ, డబ్ల్యూఎఫ్ఐ మాజీ చీఫ్ బ్రిజ్ భూషణ్ తన పాఠశాల చదువు గురించి అసలు విషయం బయటపెట్టారు. ఉత్తరప్రదేశ్‌లోని గోండాలో ఓ పాఠశాలలో విద్యార్థులను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ తాను 8వ తరగతి మూడుసార్లు ఫెయిల్ అయ్యానన్నిమోసం చేసి, కాపీ కొట్టి ఎలాగొలా పాసైనా, ఇంగ్లిష్ పరీక్ష తనకు అడ్డంకిగా మారిందన్నారు. ఇంగ్లిష్ పేపర్‌ను రాయాలంటూ తోటి విద్యార్థిని బెదిరించటాన్ని ఘనకార్యంగా చిన్నారులకు చెప్పుకున్నారు.

'ప్లాన్‌లో ఉన్నా ఎస్కేప్ రూట్ నిర్మించలేదు'

డెహ్రాడూన్ : ఉత్తరాఖండ్ ఉత్తర్‌కాశీలోని సొరంగంలో చిక్కుకుపోయిన కార్మికుల వెలికితీతకు యత్నాలు జరుగుతుండగా, ఈ ప్రమాదం అనంతరం ప్రభుత్వం చేసిన ఒక ఘోర తప్పిదం బయటపడింది. ప్రమాదాలు చోటుచేసుకుంటే వాటి నుంచి తప్పించుకునేందుకు ఎస్కేప్ రూట్‌ను కూడా ప్లాన్‌లో సిద్ధం చేస్తారు. అయితే 4.5 కి.మీ పొడవున్న ఈ సొరంగానికి కూడా అలాంటి మార్గాన్ని ప్లాన్‌లో రూపొందించినా దానిని చేపట్టిన కంపెనీ దానిని నిర్మించలేదు. తప్పించుకొనే మార్గం నిర్మించి ఉంటే కార్మికులకు ఈ దుస్థితి వచ్చేది కాదని బాధిత కుటుంబ సభ్యులు, పలువురు నేతలు విమర్శిస్తున్నారు.

డీప్‌ఫేక్ సమస్యపై త్వరలో కేంద్రం సమావేశం

న్యూఢిల్లీ, నవంబర్ 18: దేశవ్యాప్తంగా కలవరపెడుతున్న 'డీప్‌ఫేక్' సమస్యపై త్వరలోనే సామాజిక మాధ్యమాలతో సమావేశం కానున్నట్టు కేంద్ర ఐటీ శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ వెల్లడించారు. శనివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ డీప్‌ఫేక్ కంటెంట్‌ను తొలగించడానికి సామాజిక మాధ్యమాలు తగిన చర్యలు తీసుకోకపోతే వారికి సురక్షిత హార్బర్ క్లాజ్ వర్తించదని చెప్పారు. ఈ సమస్య నివారణకు ఇప్పటికే అవి కొన్ని చర్యలు తీసుకుంటున్నాయని, అయితే అది సరిపోదని.. మరింత కఠిన చర్యలు అవసరమని తాము భావిస్తున్నామన్నారు. దాంతో ఈ విషయంపై మూడు నాలుగు రోజుల్లో చర్చలు జరపనున్నట్టు చెప్పారు.

బద్రీనాథ్ ఆలయం మూసివేత

బద్రీనాథ్ : శీతాకాలం సందర్భంగా అత్యంత పవిత్రమైన బద్రీనాథ్ దేవాలయాన్ని శనివారం నుంచి మూసివేశారు. ఈ సందర్భంగా దేవాలయాన్ని 15 క్వింటాళ్ల బంతి పూలతో అందంగా అలంకరించారు. ఈ అలంకరణను చూసి భక్తులు మంత్రముగ్ధులయ్యారు. దేశ, విదేశాల నుంచి వచ్చిన భక్తులు అత్యంత భక్తి, శ్రద్ధలతో బదరీనాథునికి పూజలు చేశారు. తెల్లవారుజాము నుంచి సాయంత్రం వరకు క్యూలలో నిల్చుని బదరీనాథుని దర్శనం చేసుకున్నారు.

కాంగ్రెస్ 'పేటీఎం' కర్ణాటక!

- ప్రభుత్వంపై పెద్దయెత్తున అవినీతి ఆరోపణలు
- అధికారుల పోస్టింగ్‌లు, బదిలీల్లో 'చేతి'వాటం!
- సిద్ధరామయ్య సర్కార్‌పై ప్రతిపక్షాల ధ్వజం

సిద్ధరామయ్య

కుమారస్వామి

బెంగళూరు, నవంబర్ 18: కర్ణాటకలో కల్లబొల్లి హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్.. దోచుకోవడమే పనిగా పెట్టుకొన్నదని, రాష్ట్రాన్ని ఏటీఎంగా మార్చుకొన్నదనే విమర్శలు వస్తున్నాయి. కాంగ్రెస్ సర్కార్‌పై అవినీతి ఆరోపణలు గుప్పుమంటున్నాయి. తాజాగా 'క్యాష్ ఫర్ పోస్టింగ్స్(పోస్టింగ్, బదిలీలకు ముడుపులు)' స్కామ్‌కు సంబంధించి సీఎం సిద్ధరామయ్య, ఆయన కుమారుడు యతీంద్రకు మధ్య జరిగిన ఫోన్ కాల్ అంశం రాష్ట్ర రాజకీయాలను కుదిపేస్తున్నది.మాజీ సీఎం, జేడీఎస్ నేత హెచ్‌డీ కుమారస్వామి సీఎం సిద్ధరామయ్యను టార్గెట్‌గా చేసుకొని శనివారం మరోసారి 'క్యాష్ ఫర్ పోస్టింగ్స్' ఆరోపణలు చేశారు. ఫోన్ సంభాషణలో వినిపించిన 'వివేకానంద' అనే పేరు శుక్రవారం రాత్రి ప్రభుత్వం విడుదల చేసిన పోలీస్ ఇన్‌స్పెక్టర్ల బదిలీల జాబితాలో కనిపించిందని ఆరోపించారు. ఈ మేరకు జాబితాను ఆయన ఎక్స్ ఖాతాలో షేర్ చేశారు.

ఫోన్ కాల్‌పై కథలు వద్దు..

వివేకానంద పేరు 48 గంటల్లో బదిలీల జాబితాలో ఎలా వచ్చిందని కుమారస్వామి ప్రశ్నించారు. 'నైతికత గురించి మాటలు చెప్పే మీరు(సిద్ధరామయ్య).. ఇప్పుడు అవినీతిలో మునిగారు. సీఎం అంతరంగం బయటపడింది. దీనికి మీరు సిగ్గుపడాలి' అంటూ కుమారస్వామి ధ్వజమెత్తారు. ఫోన్ సంభాషణపై సీఎం చెప్పిన కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబులిటీ(సీఎస్ఆర్) కథను 'డూప్లికేట్ సీఎం' సూచన మేరకు అల్లారని డిప్యూటీ సీఎం డీకేను పరోక్షంగా ప్రస్తావిస్తూ పేర్కొన్నారు. కుమారస్వామి ఆరోపణలపై సీఎం సిద్ధరామయ్య స్పందిస్తూ.. ప్రజలను తప్పుదోవ పట్టించేందుకు కుమారస్వామి అబద్ధాలు చెబుతున్నారని అన్నారు.

రాష్ట్రంలో '60 శాతం కమీషన్' సర్కార్

కాంగ్రెస్ సర్కార్ కర్ణాటకను ఏటీఎంలా వాడుకొంటున్నదనే దానికి తాజా ఫోన్ సంభాషణ వీడియో సాక్ష్యమని, రాష్ట్రంలో '60 శాతం కమీషన్' సర్కార్ నడుస్తున్నదని ప్రతిపక్ష బీజేపీ నేత అశోక ఆరోపించారు.

గ్యారెంటీలు ఉత్తుత్తి అంటూ పోస్టర్లు

ఎన్నికల హామీల అమలులో కర్ణాటక కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాన్ని ఎండగడుతూ బెంగళూరులో పోస్టర్లు వెలిశాయి. గ్యారెంటీ స్కీమ్‌ల అమలులో హస్తం పార్టీ ఘోరంగా విఫలమైందని ఆ పోస్టర్లు ఎత్తిచూశాయి. పోస్టర్లలోని అంశాలు ఇలా ఉన్నాయి..

- 'గృహలక్ష్మి' పథకం కింద మహిళలకు నెలకు రూ.2 వేలు అందడం లేదు.
- నిరుద్యోగ భృతిగా 'యువ నిధి' స్కీమ్ కింద డిప్లమో చదివిన వారికి రూ.1,500, గ్రాడ్యుయేట్లకు రూ.3 వేలు ఇస్తామన్న మాట ఇంకా అమలు చేయలేదు.
- ప్రభుత్వ బస్సుల్లో మహిళలకు ఉచితంగా ప్రయాణం కల్పిస్తామని ఆర్భాటంగా ప్రారంభించిన 'శక్తి స్కీమ్'కు సరిపడా బస్సులను కేటాయించలేదు.
- రాష్ట్రంలో పట్టపగలే పెద్ద యెత్తున దోపిడీ జరుగుతున్నది.

కర్ణాటకలో 600 కోట్ల అవినీతి!

అంగన్‌వాడీలకు ఆహార సరఫరా టెండర్లలో అవకతవకలు

మంత్రి లక్ష్మి హెబ్బాళ్కర్‌పై లోకాయుక్తలో ఫిర్యాదు

బెంగళూరు, నవంబర్ 18: అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులకు అందించే పోషకాహారం పంపిణీలో అక్రమాలు చోటుచేసుకొన్నాయన్న ఆరోపణలపై కర్ణాటక మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి లక్ష్మి హెబ్బాళ్కర్‌పై లోకాయుక్తలో ఫిర్యాదు నమోదైంది. బెంగళూరుకు చెందిన నటరాజ శర్మ అనే న్యాయవాది ఈ ఫిర్యాదు చేశారు. మహిళా, శిశు సంక్షేమ శాఖలో రూ.600 కోట్లకు పైగా అవినీతి జరిగిందని ఆరోపించారు. టెండర్లలో అక్రమాలు చోటుచేసుకొన్నాయని, అనర్హులకు కాంట్రాక్టులు ఇచ్చారన్నారు. అక్రమాల్లో మంత్రి హెబ్బాళ్కర్ పాత్ర ఉన్నదని, బ్లాక్ లిస్టెడ్ క్రిస్టి ఫ్రైడ్ గ్రామ్ కంపెనీకి టెండర్లు ఇచ్చారని ఆరోపించారు. కాంట్రాక్టర్లు సరఫరా చేసిన ఆహార నాణ్యత నిర్దేశించిన ప్రమాణాలకు అనుగుణంగా లేదని లోకాయుక్త దృష్టికి తీసుకొచ్చారు. ఆహార సరఫరా బాధ్యతను స్థానిక సేవా సంస్థలకు అప్పగించాలని హైకోర్టు ఆదేశించినా.. కోర్టు ఆదేశాలను ఉల్లంఘిస్తూ, బ్లాక్‌లిస్టెడ్ కంపెనీకి టెండర్ ఇచ్చారని న్యాయవాది నటరాజ శర్మ తన ఫిర్యాదులో పేర్కొన్నారు. అక్రమాలకు పాల్పడిన మంత్రి లక్ష్మి హెబ్బాళ్కర్, మహిళా, శిశు సంక్షేమ మంత్రిత్వ శాఖ ప్రధాన కార్యదర్శి జేసీ ప్రకాశ్, డైరెక్టర్‌పై చర్యలు తీసుకోవాలని కోరారు.

శాంతి చర్చల కోసం మణిపూర్ గవర్నర్‌కు విజ్ఞప్తి

ఇంఫాల్ : మణిపూర్‌లో ఘర్షణ పడుతున్న కుకీ, మైతీ తెగల మధ్య సయోధ్య కుదిర్చేందుకు శాంతి చర్చలను తక్షణం ప్రారంభించాలని గవర్నర్ అనుసూయి యూకీని 10 రాజకీయ పార్టీల ప్రతినిధి బృందం కోరింది. కేంద్రం, ప్రధాని మోదీ జోక్యం చేసుకోవాలని తెలిపింది. ఇదిలావుండగా, కుకీ-జో తెగలకు చెందిన ఐటీ ఎల్‌ఎఫ్ సంస్థ బుధవారం ఓ హెచ్చరిక చేసింది. తమ జాతుల ప్రాబల్యంగల ప్రాంతాల్లో స్వయంపాలిత ప్రత్యేక పాలనను ఏర్పాటు చేసుకుంటామని తెలిపింది. ఇది చట్టవిరుద్ధమని రాష్ట్ర ప్రభుత్వం స్పష్టం చేసింది.

కాలేయ మార్పిడి పిల్లాడు.. డాక్టరయ్యాడు

న్యూఢిల్లీ: భారత్‌లో 25 ఏండ్ల క్రితం మొట్టమొదటి 'చైల్డ్ లివర్ ట్రాన్స్‌ప్లాంట్' జరిగింది. 20 నెలల చిన్న పిల్లాడికి చేసిన 'కాలేయ మార్పిడి' శస్త్ర చికిత్స సక్సెస్ అవ్వటం న్యూఢిల్లీలోని ఇంద్రప్రస్థ అపోలో దవాఖాన వైద్యుల్ని ఆనందంలో ముంచెత్తింది. ఆ పిల్లవాడు పెరిగి పెద్ద వాడై నేడు ఓ డాక్టర్ అవడంతో.. ఆ వైద్యుల మనస్సు గర్వంతో ఉప్పొంగింది. ఆనాటి లివర్ మార్పిడి జరిగిన తమిళనాడుకు చెందిన సంజయ్ కందసామి ఎంబీబీఎస్ చదువుకొని కాంచీపురంలోని స్థానిక దవాఖానలో వైద్యుడిగా సేవలు అందిస్తున్నాడు. ఇది తమకు ఎంతగానో గర్వకారణమని శస్త్ర చికిత్స వైద్యుల బృందంలో ఒకరైన అనుపమ్ అన్నారు.

బెల్లెన్

ఆస్ట్రియా అధ్యక్షుడిని కరిచిన మాల్డోవా అధ్యక్షురాలి కుక్క

బెర్లిన్: మాల్డోవాకు వెళ్లిన ఆస్ట్రియా అధ్యక్షుడు వాన్ డర్ బెల్లెన్‌కు చేదు అనుభవం ఎదురైంది. మాల్డోవా అధ్యక్షురాలు మేయి సందు పెంపుడు కుక్క 'కోడ్రెట్' బెల్లెన్ చేతిని కొరికింది. మాల్డోవా రాజధానిలోని అధ్యక్షురాలి అధికారిక నివాసంలో శుక్రవారం సండు, బెల్లెన్ మాటాడుకొంటూ ఉండగా ఈ ఘటన జరిగినట్టు స్థానిక మీడియా తెలిపింది. అధ్యక్షురాలి రెస్క్యూ డాగ్‌గా..'కోడ్రెట్' ఆ దేశ ప్రథమ కుక్క హోదాను కలిగి ఉంది. ఈ ఘటనలో బెల్లెన్ చేతికి స్వల్ప గాయమైంది. ఘటనపై సండు బెల్లెన్‌కు క్షమాపణ చెప్పారు. పర్యటన ముగించుకొని వెళ్లేప్పుడు ఆస్ట్రియా అధ్యక్షుడు బెల్లెన్ ఆ కుక్కకు ఓ బొమ్మను బహూకరించటం విశేషం.

మొక్కలకున్న ఆ 'సత్తా' చాలా ఎక్కువ

*న్యూఢిల్లీ: మానవాళికి మొక్కలు చేసే మేలు అందరికీ తెలిసిందే. వాతావరణంలోని కార్బన్ డయాక్సైడ్‌ను మొక్కలు స్వీకరించడ